క్లుప్తంగా

బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్‌కు సన్మానం



రాములుగౌడ్‌ను సన్మానిస్తున్న నాయకులు

శంకర్‌పల్లి: బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్‌గా పట్టణానికి చెందిన బసగళ్ల రాములుగౌడ్ ఇటీవల ఎన్నికయ్యారు. ఈ మేరకు బుధవారం పట్టణంలోని ఆయన నివాసంలో బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు దయాకర్‌రెడ్డి, చేవెళ్ల మండల అధ్యక్షుడు అత్తెల్లి అనంతరెడ్డి, నియోజకవర్గ నాయకుడు వైభవ్‌రెడ్డి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాములుగౌడ్ బీజేపీలో ఎన్నో ఏళ్లుగా క్రియాశీలకంగా పనిచేస్తున్నారని, చేసిన సేవలను గుర్తించి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా అవకాశం కల్పించినట్లు గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యుడు వాసుదేవ్ కన్నా, నాయకులు ఇంద్రాసేనారెడ్డి, శ్రీకాంత్, పరమేశ్వర్‌రెడ్డి, ప్రవీణ్, శ్రీకాంత్‌రెడ్డి, భార్గవ్‌రెడ్డి, జయసింహారెడ్డి, దండు రామ్మోహన్, నర్సింహ, గాలయ్య తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనునాయక్



ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న వ్యవసాయ కూలీలు

షాద్‌నగర్: ఇల్లు లేని నిరుపేదలందరికీ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీను నాయక్ డిమాండ్ చేశారు. బుధవారం వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఆర్డీఓ సరితను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం శ్రీను మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో ఎంతో మంది నిరుపేదలు ఉండేందుకు ఇల్లు లేకపోవడంతో గుడిసెల్లో నివాసం ఉంటున్నారని, అలాంటి వారికి ప్రభుత్వం మొదటి ప్రాధాన్యతనిచ్చి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదే విధంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు కూలీ దినాలను రెండు వందల రోజులకు పెంచాలని, రోజుకు రూ.800 కూలీ ఇవ్వాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న ఉపాధి హామీ నిధులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలన్నారు. కూలీలు పని చేస్తున్న ప్రదేశాల్లో కనీస మౌలిక సదుపాయాలు లేక ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని, కార్మికులకు సేఫ్టీ పరికరాలు, టెంట్లు, మంచినీటి వంటి సదుపాయాలు కల్పించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో వ్యవసాయ కార్మికులు నర్సింలు, యాదయ్య, కృష్ణయ్య, చంద్రకళ, లక్ష్మయ్య, తులసి, అంజలి, లింగమ్మ, బుడ్డమ్మ, నర్సింలు తదితరులు ఉన్నారు.

దుండగులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు



ఎస్‌ఐకి ఫిర్యాదు చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

షాద్‌నగర్: ఫరూఖ్‌నగర్‌లోని సుభాష్ చంద్రబోస్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన బీఆర్‌ఎస్ పార్టీ జెండా దిమ్మె, ఇసుక పైపును గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం రాత్రి ధ్వంసం చేసేందుకు ప్రయత్నించారు. విషయం తెలుసుకున్న ఆ పార్టీ నాయకులు పెద్దఎత్తున ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. అనంతరం దిమ్మెను ధ్వంసం చేసేందుకు ప్రయత్నించిన దుండగులను గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పార్టీ నాయకులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ శరత్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పార్టీ దిమ్మెను కొందరు కావాలనే ధ్వంసం చేసేందుకు ప్రయత్నించారని ఆరోపించారు. బీఆర్‌ఎస్ పార్టీ దిమ్మె పక్కనే ఇతర పార్టీల జెండాలు ఉన్నాయని, వాటిని కాకుండా తమ పార్టీకి చెందిన దిమ్మెను ధ్వంసం చేసేందుకు కుట్ర పన్నారని ఆరోపించారు. ధ్వంసం చేసేందుకు ప్రయత్నించిన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో నాయకులు కొందూటి నరేందర్, ఎంఎస్ నటరాజ్, బచ్చలి నర్సింహ, చింటు, జూపల్లి శంకర్, యుగేందర్, లక్ష్మణ్ నాయక్, శేఖర్, అంతయ్య, మన్నె నారాయణ పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్య సంరక్షణకు చర్యలు

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



విద్యార్థులకు కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: విద్యార్థుల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. వైద్యారోగ్యశాఖ, రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా ఇటీవల షాద్‌నగర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రిలో కంటి పరీక్షలు నిర్వహించిన విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా అద్దాలను సరఫరా చేసింది. ఈ అద్దాలను బుధవారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ.. శరీరంలో కళ్లు ఎంతో ప్రధానమైనవని, జాగ్రత్తగా కాపాడుకోవాలని సూచించారు. చిన్నారులు సెల్‌ఫోన్‌లు, టీవీలు అధికంగా చూడటంతో చూపు మందగిస్తుందని, తద్వారా చదువుపై ప్రభావం పడుతుందన్నారు. విద్యార్థులు వెలుతురు ఉండే ప్రదేశాల్లో చదువుకోవాలని సూచించారు. కంటికి ఏ చిన్న సమస్య వచ్చినా వెంటనే సమీపంలో ఉన్న వైద్యులను సంప్రదించి చికిత్సలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా తల్లిదండ్రులు తమ పిల్లలకు పౌష్టిక విలువలతో కూడిన ఆహారాన్ని అందించాలని, దీంతో కంటి సమస్యలను అధిగమించవచ్చన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ విజయలక్ష్మి, ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్‌బీఎస్‌కే వైద్యులు రాగిణి, విజయలక్ష్మి, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, శ్రావణ్‌కుమార్, నర్సింహారెడ్డి, శ్రీనివాసులు, లోకనాథ్, అన్నపూర్ణ, జ్యోతి, సునీత, హెచ్‌ఎం భాగ్యమ్మ, ఉపాధ్యాయులు చెన్నారెడ్డి, శ్రీనివాసులు, వెంకటయ్య, నాయకులు బాబర్‌ఖాన్, తిరుపతిరెడ్డి, చెన్నయ్య, విజయ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



హిమాయత్‌నగర్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రం

మండల విద్యాధికారి వెంకటయ్య

మొయినాబాద్‌రూరల్: ఈ నెల 21వ తేదీ నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షల నిర్వహణకు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని మండల విద్యాధికారి వెంకటయ్య అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదో తరగతి పరీక్షలకు మండలంలో ఏడు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని, మండలం, మున్సిపాలిటీలో మొత్తం 1,399 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని పేర్కొన్నారు. మొదటిరోజు సుమారు 30 నిమిషాల ముందే విద్యార్థులు పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. ఉదయం 9.30 గంటల నుంచి 12.30 గంటల వరకు పరీక్ష ఉంటుందని తెలిపారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు పెన్నులు, స్టేషనరీ తప్పకుండా తెచ్చుకోవాలని, దివ్యాంగులైన విద్యార్థులు పరీక్షా కేంద్రంలోనికి వెళ్లే విధంగా ర్యాంపులు ఏర్పాటు చేశామని తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో సీసీకెమెరాలతో నిఘా ఉంటుందని స్పష్టం చేశారు. వేసవి కాలం కావడంతో విద్యార్థులు అస్వస్థతకు గురైతే విద్యార్థుల కోసం కేంద్రాల బయట పీహెచ్‌సీ సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు.

హామీల అమలులో ప్రభుత్వాలు విఫలం



రామన్నగూడలో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామస్వామి

చేవెళ్ల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమయ్యాయని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కె.రామస్వామి అన్నారు. మండలంలోని రామన్నగూడలో బుధవారం సీపీఐ పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను జీఎస్టీ పరిధిలోకి తీసుకొస్తామని చెప్పి అమలు చేయటంలో విఫలమైందన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ పార్టీ వందవ వసంతంలోకి అడుగుపెట్టిన సందర్భంగా డిసెంబర్ 26వ తేదీవరకు పార్టీ వారోత్సవాలు ఘనంగా జరుపుకోవాలని నిర్ణయించిందన్నారు. దీంతో గ్రామగ్రామాన సీపీఐ పార్టీ జెండాలను ఆవిష్కరించి ప్రజలకు పోరాటాలను తెలియజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి సత్తిరెడ్డి, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎండీ మక్బుల్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు సుధాకర్‌గౌడ్, గీత పనివాళ్ల సంఘం మండల కార్యదర్శి కృష్ణగౌడ్, ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు శివ, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్ల మంజుల, ఏఐటీయూసీ జిల్లా కౌన్సిల్ సభ్యురాలు మీనాక్షి, వెంకటయ్య, సుగుణమ్మ తదితరులు ఉన్నారు.

'లక్ష్మీదేవిపల్లి' నిర్మాణానికి ఆమోదంపై హర్షం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు ధన్యవాదాలు తెలిపిన జేఏసీ నాయకులు

షాద్‌నగర్‌రూరల్: షాద్‌నగర్ ప్రాంత ప్రజల చిరకాల కల లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణానికి ప్రభుత్వం ఆమోదం తెలపడం హర్షణీయమని తాలుకా జాయింట్ యాక్షన్ కమిటీ(జేఏసీ) చైర్మన్ జనార్దన్ అన్నారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రిజర్వాయర్ నిర్మాణం కోసం గత దశాబ్ద కాలంగా అనేక ఉద్యమాలు, పోరాటాలు చేశామన్నారు. ఈ ప్రాంత ప్రజల సాగునీరు, తాగునీటి కష్టాలను తీర్చేందుకు ప్రాజెక్టు నిర్మాణం పనులను చేపట్టాలని కోరుతూ వినతి పత్రాలు, ప్రజెంటేషన్‌లను ఇచ్చామని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఉద్యమ కృషి ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు నిర్మాణానికి ఆమోదం తెలుపడం హర్షణీయమన్నారు. ప్రాజెక్టు నిర్మాణానికి నిధులను కేటాయించడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. సమావేశంలో జేఏసీ నాయకులు కరుణాకర్, నక్కబాల్‌రాజ్, పాలమూరు అధ్యయన వేదిక జిల్లా కన్వీనర్ రవీంద్రనాథ్, నాయకులు దిలీప్‌కుమార్, వెంకటయ్య, రాము, నర్సింలు, అనంతం పాల్గొన్నారు.

కలెక్టరేట్‌కు తరలిన ఆశలు



కలెక్టరేట్‌కు బయలుదేరిన ఆశ కార్యకర్తలు

కేశంపేట: తమకు ఫిక్స్‌డ్ జీతం చెల్లించాలని కోరుతూ మండల కేంద్రం నుంచి ఆశ కార్యకర్తలు బుధవారం కలెక్టరేట్‌కు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆశలు మాట్లాడుతూ.. గత కొంత కాలంగా తమకు ఫిక్స్‌డ్ జీతంను చెల్లించాలని కోరుతున్నా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. తమకు పీఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని వారు డిమాండ్ చేశారు. సెలవులతో కూడిన వేతనం అందించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను అందించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సుజాత, వసంత, పద్మ, జ్యోతి, పర్వీనా, సంతోష, స్వప్న, అనురాధ, గీత, సరస్వతి, కరుణ, సంగీత ఉన్నారు.

వేతనాల చెల్లింపులో నిర్లక్ష్యం సరికాదు

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జంగయ్య



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న జంగయ్య

షాబాద్: ఉపాధి హామీ కూలీలకు పెండింగ్ వేతనాలు చెల్లిండంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దుల జంగయ్య డిమాండ్ చేశారు. బుధవారం మండల పరిధిలోని మన్‌మర్రిలో ఆయన ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీల వద్దకు వెళ్లి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎండలో పనులు చేస్తున్న కూలీలకు కూలీ గిట్టుబాటు కావడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 200 రోజులు పనులు కల్పించి రోజు కూలీ రూ.700 ఇవ్వాలని, పనులు చేయడానికి సామగ్రి, రవాణా సౌకర్యం కల్పించాలని కోరారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి ఎస్.జంగయ్య, గ్రామ కార్యదర్శి నర్సింలు, భిక్షపతి, వెంకటేశ్, నర్సింలు, లక్ష్మమ్మ, మాణెమ్మ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు



మొయినాబాద్‌రూరల్: వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు



షాబాద్: తల్లిదండ్రులకు పాదపూజ చేస్తున్న విద్యార్థులు

కొందుర్గు: కొందుర్గు బీసీ హాస్టల్‌లో బుధవారం పదో తరగతి విద్యార్థులకు వార్డెన్ రఘురాములు ఆధ్వర్యంలో వీడ్కోలు సమావేశం ఘనంగా ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఎంపీఓ విజయ్‌కుమార్ హాజరై మాట్లాడారు. విద్యార్థులు పదిలో మంచి ఫలితాలు సాధించి పాఠశాలకు, హాస్టల్‌కు మంచి పేరు తేవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు దశరథం, వీరేషం తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులను గౌరవించాలి

షాబాద్: తల్లితండ్రులను దైవసమానులుగా గౌరవించినప్పుడే సమాజం బాగుపడుతుందని వందేమాతరం ఫౌండేషన్ చైర్మన్ మాధవరెడ్డి, తాళ్లపల్లి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం విష్ణువర్దన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని తాళ్లపల్లి ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు సమావేశం నిర్వహించారు. అనంతరం వారి తల్లితండ్రులకు పాదపూజలు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సంఘమేశ్వర్‌రెడ్డి, కిరణ్మయి, నాగిరెడ్డి, గ్లోరీ, శోభారాణి, మొగ్గలయ్య, బాలకృష్ణ, శీతాబాయి, లలిత, మంజుల, యూసుఫ్, గ్రామస్తులు తదతరులు ఉన్నారు.

ప్రశాంతంగా పరీక్షలు రాయాలి

మొయినాబాద్‌రూరల్: విద్యార్థులు భయాందోళనకు గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని అమ్డాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రేణుక, మండల విశ్వకర్మ గౌరవ అధ్యక్షుడు నర్సింహాచారి అన్నారు. మండల పరిధిలోని అమ్డాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు హాల్‌టికెట్స్ పంపిణీ చేశారు. అనంతరం వేడుకల్లో విద్యార్థులు చేసిన సంస్కృతిక నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సత్యనారాయణరెడ్డి, నరేందర్‌రెడ్డి, శోభారాణి, సౌభాగ్యలక్ష్మి, మహేశ్వరి, జ్యోతి, నాగేశ్, అమ్డాపూర్ ప్రత్యేకాధికారి దేవీరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

షాబాద్: వేసవిలో బాటసారుల దాహార్తిని తీర్చేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎంపీఓ శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని పోతుగల్ గ్రామంలో గ్రామస్తులు చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన గ్రామస్తులతో కలిసి చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అశోక్, గ్రామస్తులు దయానంద్‌గౌడ్, యాదయ్య, మనీర్, సత్యనారాయణగౌడ్, కృష్ణారెడ్డి, గోపాల్‌రెడ్డి, కృష్ణ పాల్గొన్నారు.

మొయినాబాద్ మున్సిపాలిటీలో మరో గ్రామం

అప్పోజీగూడను విలీనం చేస్తూ బిల్లు పాస్ చేసిన ప్రభుత్వం

మొయినాబాద్: మొయినాబాద్ మున్సిపాలిటీలో మరో గ్రామం విలీనమైంది. అప్పోజీగూడ గ్రామ పంచాయతీని మున్సిపాలిటీలో విలీనం చేస్తూ బుధవారం ప్రభుత్వం అసెంబ్లీలో బిల్లు పాస్ చేసింది. దీంతో మొయినాబాద్ మున్సిపాలిటీలో విలీనమైన గ్రామ పంచాయతీల సంఖ్య తొమ్మిదికి చేరగా.. మండలంలో మిగిలిన గ్రామ పంచాయతీల సంఖ్య 19కి తగ్గింది. గత జనవరి 27న ప్రభుత్వం కొత్త మున్సిపాలిటీలను ఏర్పాటు చేసింది. అందులో భాగంగా 8 గ్రామ పంచాయతీలను కలిపి మొయినాబాద్ మున్సిపాలిటీని ఏర్పాటు చేసింది. ఇందులో అజీజ్‌నగర్, హిమాయత్‌నగర్, ఎనికేపల్లి, చిలుకూరు, పెద్దమంగళారం, మొయినాబాద్, సురంగల్, ముర్తూజగూడ గ్రామాలను చేర్చింది. అయితే అప్పట్లోనే అప్పోజీగూడ గ్రామస్తులు తమ పంచాయతీని సైతం మున్సిపాలిటీలో చేర్చాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించారు. గతంలో చిలుకూరు గ్రామ పంచాయతీకి అనుబంధంగా ఉన్న అప్పోజీగూడను 2018లో ప్రభుత్వం కొత్త గ్రామ పంచాయతీగా చేసింది. చిలుకూరును మున్సిపాలిటీలో చేర్చడంతో తమ గ్రామాన్ని కూడా చేర్చాలని గ్రామస్తులు పట్టుబట్టారు. దీనికి సంబంధించిన ప్రతిపాదనలను అధికారులు ప్రభుత్వానికి పంపారు. దీంతో ప్రభుత్వం అప్పోజీగూడను మున్సిపాలిటీలో చేర్చడానికి అంగీకరించి అసెంబ్లీలో బిల్లు ప్రవేశ పెట్టి పాస్ చేసింది.

ఏళ్ల కల.. నెరవేరిన వేళ

- ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదంపై ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సంబురాలు
- ఆయా గ్రామాల్లో మందకృష్ణమాదిగ చిత్రపటాలకు క్షీరాభిషేకం

చేవెళ్ల: ఎస్సీ వర్గీకరణ బిల్లు ఎన్నో ఏళ్ల కల అని మందకృష్ణ మాదిగ పోరాట ఫలితంగానే నెరవేరిందని ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి బి.శివశంకర్‌మాదిగ, ఎంఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నాని భానుప్రసాద్‌మాదిగ అన్నారు. మండల కేంద్రంలోని అంబేద్కర్, పూలే విగ్రహాల ఎదుట బుధవారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో అమరవీరులకు నివాళులర్పించి మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మాదిగలంతా మందకృష్ణమాదిగకు జీవితకాలం రుణపడి ఉంటారన్నారు. ఇదీ ఎమ్మార్పీఎస్ విజయంగా సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఊరేళ్ల నరేశ్, దామరగిద్ద చందు, గుండాల మల్లేశ్, ఘనాపూరం రాములు, మల్కాపూర్ శాంతికుమార్, అల్లవాడ విజయ్‌కుమార్, గొల్లపల్లి వెంకటేశ్, కందవాడ మహేందర్, నాయకులు సత్యనారాయణ, సత్యనందం, రమేశ్, వరుణ్ తదితరులు ఉన్నారు.

మందకృష్ణ చిత్రపటానికి క్షీరాభిషేకం

షాబాద్: రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ బిల్లుకు ఆమోదం తెలుపడంపై ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు క్యాసారం శంకర్‌రావు మాదిగ, మండల అధ్యక్షుడు అక్కమొళ్ల జంగయ్య మాదిగ హర్షం వ్యక్తం చేశారు. బుధవారం మండల కేంద్రంలోని అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాల వద్ద ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మాజీ అధ్యక్షులు ముక్క విశ్వంమాదిగ, మండల అధికార ప్రతినిధి మల్కి ప్రవీణ్‌మాదిగ, టీజేఎస్ చేవెళ్ల డివిజన్ ఇన్‌చార్జి నాగని రామకృష్ణ(ఆర్కే), తాళ్లపల్లి అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు ఆంజనేయులు, నాయకులు బాల్‌రాజ్, దయాకర్ మాదిగ, సుదర్శన్‌మాదిగ తదితరులు ఉన్నారు.

మందకృష్ణ పోరాట ఫలితమే..

కొందుర్గు: మందకృష్ణ మాదిగ పోరాట ఫలితంగానే ఎస్సీ వర్గీకరణ రూపుదాల్చుకుందని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ఆనంద్ అన్నారు. ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు ప్రేమ్‌కుమార్, సిద్దు, నర్సింలు, చెన్నయ్య, యాదయ్య, రమేశ్, అశోక్, నరేశ్, గణేశ్, రామస్వామి పాల్గొన్నారు.

కేశంపేటలో..

కేశంపేట: అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందడం పట్ల మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణమాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో రమేశ్, గ్యార సురేశ్, గంజాయి దశరథ, మల్లేశ్, మురళీ, హరికుమార్, మల్లయ్య, రాజు, జంగయ్య, సునీల్, మహేశ్, మహేందర్, ప్రదీప్, లడ్డు తదితరులు పాల్గొన్నారు.



చేవెళ్లలో మందకృష్ణమాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు



కేశంపేట: చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

ఎమ్మెల్యేపై దుష్ప్రచారం తగదు



మార్చిన ప్రొసీడింగ్స్‌ను చూపుతున్న సుదర్శన్‌గౌడ్, నాయకులు

- ఉనికిని కాపాడుకోవడానికే బీఆర్‌ఎస్ ఆరోపణలు
- కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు సుదర్శన్‌గౌడ్

కొత్తూరు: కనుమరుగవుతున్న తమ ఉనికిని కాపాడుకోవడం కోసమే బీఆర్‌ఎస్ నాయకులు, కొత్తూరు మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌పై అవాస్తవాలను ప్రచారం చేస్తున్నారని మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సుదర్శన్‌గౌడ్ అన్నారు. ఎమ్మెల్యేపై బీఆర్‌ఎస్ నాయకులు చేసిన వ్యాఖ్యలకు నిరసనగా ఆయన పట్టణంలో బుధవారం పలువురు నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయనతో పాటు పలువురు మాట్లాడుతూ.. ఇటీవల బీఆర్‌ఎస్ నాయకులు ఎమ్మెల్యే, కాంగ్రెస్ నాయకులపై మాట్లాడిన మాటలు సరికాదన్నారు. మున్సిపాలిటీ పాలన వ్యవహారంలో కాంగ్రెస్ నాయకులు, ఎమ్మెల్యే ఏ మాత్రం జోక్యం చేసుకోవడం లేదన్నారు. రాజకీయాలకతీతంగా మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరిస్తామన్నారు. గత పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ నాయకులు రోడ్లను ఎందుకు అభివృద్ధి చేయలేదని ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే ఎమ్మెల్యే చొరవతో అభివృద్ధి పనులు జరిగాయన్నారు. కార్యక్రమంలో నాయకులు వీరమోని దేవేందర్‌ముదిరాజ్, కర్రొళ్ల సురేందర్, శ్రీను, నవీన్‌చారి, నర్సింలు, సత్తయ్య, జనార్దన్‌చారి, విజయపాల్‌రెడ్డి, జగన్, భరత్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బీసీ బిల్లు ఆమోదం హర్షణీయం

బీసీ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రదీప్‌కుమార్



మాట్లాడుతున్న బీసీ మహాసభ నాయకులు

షాద్‌నగర్‌రూరల్: బీసీలకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో 42 శాతానికి రిజర్వేషన్లను పెంచుతూ అసెంబ్లీలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బీసీ బిల్లు ఏకగ్రీవంగా ఆమోదం పొందడం హర్షణీయమని బీసీ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మానపాటి ప్రదీప్‌కుమార్ అన్నారు. బుధవారం పట్టణంలోని బీసీ మహాసభ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు క్యాసెట్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీసీలకు 42శాతం రిజర్వేషన్లను కల్పిస్తామని రాహుల్ గాంధీ చేసిన కామారెడ్డి డిక్లరేషన్‌కు కట్టుబడి అసెంబ్లీలో చట్టబద్ధత కల్పించి కాంగ్రెస్ ప్రభుత్వం మాట నిలబెట్టుకుందన్నారు. బీసీలు రిజర్వేషన్లను సాధించుకున్నప్పుడే రాజ్యాధికారం సాధ్యమవుతుందన్నారు. కేంద్రంలో బీసీ బిల్లుకు చట్టబద్ధత కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల వారిని కలుపుకొనిపోయి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడిని తీసుకురావాలని కోరారు. బీసీ బిల్లుకు చట్టబద్ధత కల్పించేందుకు అసెంబ్లీలో తీర్మానం చేయడంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలను తెలియజేశారు. సమావేశంలో బీసీ మహాసభ నాయకులు కృష్ణాజీ, యాదయ్య, భరత్, అశోక్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.